www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 30 డిసెంబర్ 2024
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

ధరల దరువు



- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు
- అందనంటున్న కూరగాయలు
- అల్లాడుతున్న సామాన్య ప్రజానీకం
- ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇటు నిత్యావసరాలు, అటు కూరగాయల ధరలు ఆకాశాంటున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యుడికి కనీసం పచ్చడి మెతుకులు కూడా కరువైంది. మార్కెట్‌లో వంటింటి సామాన్ల ధరలు మోత మోగిస్తున్నాయి. కంది, మినప పప్పుల ధరలు ఉడుకుతున్నాయి, నూనె ధరలు కాక రేపుతున్నాయి , సామాన్యుని వంట గది సరుకులు లేక ఖాళీగా ఉన్నాయి. పప్పులు, వంటనూనె, కూరగాయల ధరలు ప్రజలకు అందనంత ఎత్తుకు పోయాయి. ప్రభుత్వాలు మారిన సామాన్యుని బతుకు మారలేదు. ధరలను అదుపుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. వెల్లుల్లి, ఎండుమిర్చి వంటి నిత్యావసర ధరలు సైతం ఆకాశాన్నంటడంతో సామాన్యుడి బతుకులు భారంగా మారాయి. తాము ఏంచేసినా పప్పులు ఉడుకుతున్నాయ్ అని ప్రభుత్వాలు భావిస్తున్న పరిస్థితి. పౌష్టికాహారంలో కీలక పాత్ర పోషించే పప్పుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో ధరలు చూసి జనం బెదిరిపోతున్నారు. కిలో కందిపప్పు రూ.180 పలుకుతుండగా, మినపప్పు రూ.115, శనగపప్పు రూ.125, పెసరపప్పు రూ.160 వరకూ పలుతుకున్నాయి. దీంతో గతంలో కిలో పప్పు ఉపయోగించే కుటుంబాలు ఇప్పుడు అరకిలో ఉపయోగిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పౌష్టికాహార లోపంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న పరిస్థితి నెలకొంది. సబ్సిడీపై కొన్ని సరుకులు అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్న మాటలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయి. గతంలో నెలవారీ సరులకు ఖర్చు రూ.రెండు వేలు వెచ్చించే కుటుంబాలు ఇప్పుడు ఏకంగా రూ. నాలుగు వేలకు పైగా వెచ్చించాల్సిన పరిస్థితి. సామాన్య ప్రజానీకం రోజంతా కష్టపడితే వచ్చే సొమ్ము రూ.400 మాత్రమే. నెలలో 20 రోజులకు మించి పనులుండవు. నెలకు ఎక్కువగా లెక్కించినా రూ. ఎనిమిది వేలకు మించి ఆదాయం రాని పరిస్థితిలో జిల్లాలో లక్షల కుటుంబాలున్నాయి. మాల్స్, వ్యాపార దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు రూ.ఏడు నుంచి రూ. తొమ్మిది వేల వరకూ మాత్రమే వేతనాలు అందుకుంటున్నారు. అంతంతమాత్రం ఆదాయం ఉన్న కుటుంబాలు ఈ ధరలతో బతుకు నెట్టుకురాలేక నానా ఇబ్బందులు పడుతున్నాయి. పప్పుల ధరలతోపాటు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరల చూసి జనం వణికిపోతున్నారు.





వెల్లుల్లి, ఎండుమిర్చి ధరలు పైపైకి..

ఆరోగ్య రీత్యా వంటింట్లో అధికంగా ఉపయోగించే వస్తువు వెల్లుల్లి. ప్రస్తుతం వెల్లుల్లి ధర కిలో రూ.400 పలుకుతోంది. పావు కిలో అయితే రూ.110 తీసుకుంటున్నారు. దీంతో వెల్లుల్లి కొనుగోలు చేయాలంటే జనం భయపడే పరిస్థితి నెలకొంది. రోజూ తాలింపుల్లో ఉపయోగించే ఎండుమిర్చి ధర ఏకంగా కిలో రూ.260లకు చేరింది. దీంతో తాలింపుల్లో ఎండుమిర్చి వేయాలంటేనే జనం వణికిపోతున్నారు. విజయ్ ఆయిల్ రూ.155 వరకూ పలుకుతుండగా సన్ ఫ్లవర్ వంటి మిగిలిన వంట నూనెల ధరలు కిలో రూ.145 వరకూ పలుకుతున్నాయి. పంచదార, ఇడ్లీ రవ్వ, బొంబాయి రవ్వ వంటి నిత్యావసర వస్తువుల ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. దీంతో సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. కూరగాయల ధరలు సైతం అంతే స్థాయిలో మండిపోతున్నాయి. కిలో అల్లం పాతది రూ.120 పలుకుతోంది. క్యారెట్ కిలో రూ.64, కాప్సికమ్ కిలో రూ.76 , ఉల్లి ధర కిలో రూ.70 ఇలా ప్రతి కూరగాయ ధర కిలో రూ.60పైనే పలుకుతోంది. ప్రభుత్వం కేవలం వెల్లుల్లి గురించి మాత్రమే మాట్లాడుతూ కాలక్షేపం చేస్తోంది. అడ్డూ అదుపులేకుండా పెరుగుతున్న ధరలతో సామాన్యుల బతుకులు రోజురోజుకూ కష్టంగా మారుతున్నాయి. దీంతో ప్రతి వస్తువూ తక్కువ పరిణామంలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో తగినంత మోతాదులో తీసుకోక పోవడంతో అనారోగ్యం పాలవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. అధికారంలోకి రాక ముందు ధరలు పెరిగిపోయా యంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. అదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం పూర్తిగా విఫలమయ్యాయి.

రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలి

రేషన్ షాపుల ద్వారా రాయితీలతో పెరిగిన నిత్యా వస్తువులను సరఫరా చేయాలని అలాగైతేనే సామాన్యుల మీద భారం తగ్గుతుంది. ధరల పెరుగుదల గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

-హసీనా, గృహిణి పులివెందుల

ఉన్నంతలో సర్దుకోవాల్సిన పరిస్థితి

విపరీతంగా పప్పు, నూనె, కూరగాయల ధరలు పెరగడంతో కోర్కెలు చంపుకొని ఉన్నదానితో సరిపెట్టుకొని బతకాల్సి వస్తుంది. ఇంకా ఇలా ఎన్ని రోజులు ఉంటుందో అర్థం కాని పరిస్థితి.

-భవాని , వ్యవసాయ కూలీ పులివెందుల

ప్రభుత్వాలు మారినా.. ధరలు మారలేదు

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ధరలు మాత్రం మారలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా మాట్లాడి అధికారం వచ్చిన తర్వాత ధరల నియంత్రణ చేయలేక సాకులు చెబుతున్నాయి. పేదల బతుకు మారేది ఎప్పుడు అన్న సందేహం కలుగుతుంది.

-గోపాల్, చిరు ఉద్యోగి , పులివెందుల

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పోరాడుదాం

- పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా?
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలని, దేశంలో విద్యారంగాన్ని కేంద్రప్రభుత్వం నాశనం చేస్తుందని ఆ రంగాన్ని పరిరక్షించేందుకు ఐక్యంగా పోరాడదామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన నేతల చరిత్రలను పాఠ్యాంశాల నుంచి తొలగించి, దేశానికి ద్రోహం చేసిన నేతల గురించి చేర్చడం అన్యాయమన్నారు. పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో విద్యారంగాన్ని సర్వనాశనం చేసిందన్నారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ కోసం ఎంతో మంది విద్యార్థులు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉక్కు పరిశ్రమను నష్టాల సాకుతో విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. విద్యతో పాటు, వ్యవసాయం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసేందుకు బిజెపి ప్రయత్నాలు కొనసాగిస్తుందన్నారు. ప్రధాని మోడీ దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచి పెడుతున్నారన్నారు. కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాలరాస్తున్నాయని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న తీరుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్య పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్ మాట్లాడుతూ దేశానికి నాయకత్వం కొరత ఉందని, విద్యార్థి దశ నుంచి విద్యారంగ సమస్యలపై అనునిత్యం పోరాటాలు చేస్తూ దేశానికే గర్వకారణంగా పోరాడుతున్న ఏకైక జెండా ఎస్ఎఫ్ఐ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కోటాను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో వచ్చిన మార్పుల పైన ఎక్కడా మాట్లాడడం లేదన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారాలోకేష్ మాట్లాడిన మాటలు నీటి మీద రాతలే తప్ప ఎక్కడా ఆచరణలో కనపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నిటిని పైన భవిష్యత్తులో విద్యార్థుల మద్దతుతో పోరాటం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు హరినాథ్ శర్మ, ప్రజాసంఘాల నాయకులు, పి. శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ నాయకులు మదన్మోహన్, జై బాబు, గిరి, అఫ్రిద్, ప్రశాంత్, గురునాథ్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుల రాజకీయాలు చేయడం శోచనీయం

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుల రాజకీయాలు చేయడం సబబుగా లేదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అభివృద్ధికి ఉపయోగించాలే కానీ రాజకీయాలు చేయకూడదని రాజంపేట పార్లమెంట్ సభ్యులు ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. ఆదివారం మదనపల్లెకు వచ్చిన ఎంపీ వైసిపి సీనియర్ నాయకులు బాబ్‌జాన్ ఇంట్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడులో చోటు చేసుకున్న చిన్న పాటి ఘర్షణను పెద్దదిగా చిత్రీకరించి, వైసిపి నాయకుడు సుదర్శన్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అవమాన కరంగా అరెస్టు చేయడం తగదన్నారు. ఎంపిడిఒ జవహర్ బాబును పరామర్శించే పేరుతో రాయచోటి నియోజకవర్గంలోకి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కులాలను తీసుకొచ్చి, రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదే పవన్ కల్యాణ్ కాకినాడలో దళిత ప్రొఫెసర్‌ను కూటమి నాయకులు దాడి చేసి కొట్టినప్పుడు, తిరుపతిలో దళిత ప్రొఫెసం ను కూటమి నాయకులు దాడి చేసి కొట్టినప్పుడు, సొంత నియోజకవర్గం పిఠాపురంలో మహిళపై అత్యాచారం చేస్తే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కూటమి నాయకులు ఎక్కడ ఏమి చేసినా కనీసం కేసు కూడా నమోదు చేయని పోలీసులు వైసిపి నాయకులపై మాత్రం అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. వీటన్నిటిని న్యాయపరంగా ఎదుర్కోవడానికి వైసిపి సిద్ధంగా ఉందన్నారు. మదనపల్లె పట్టణంలో మెడికల్ కళాశాలను తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని వైసిపి ప్రభుత్వం భావిస్తే, కూటమి ప్రభుత్వం మాత్రం ప్రయివేట్ పరం చేసి పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయాలని చూస్తోందని పేర్కొన్నారు. ఇది ఎంత మాత్రం క్షమించరాని నేరం అన్నారు. ట్రస్ట్ ఆధీనంలో రూ. 200 కోట్లకు పైచిలుకు ఆస్తులున్న బిటి కళాశాలను యూనివర్సిటీ చేయాలని జీవో తీసుకొస్తే కూటమి ప్రభుత్వం రాగానే ఆ పనులను గాలికి వదిలేశారని విర్శించారు. వందేళ్ల సుధీర్ఘ చరిత్ర ఉన్న కళాశాలను యూనివర్సిటీగా మార్చడం వల్ల మదనపల్లె ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రతి ఇంటికి మంచినీరు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో 50 శాతం కేంద్ర నిధులతో వాటర్ గ్రిడ్ పథకాన్ని తీసుకొస్తే అమలు చేయాల్సిన కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయడం వెనుక ఉన్న రాజకీయ మేంటో చెప్పాలన్నారు. ప్రజలకు మంచి చేయాలి కానీ రాజకీయాలు చేయకూడదని హితువు పలికారు. తాను కేంద్రంతో పోరాడి మదనపల్లెకు కేంద్ర విద్యాలయం తీసుకొచ్చానని, కనీసం ఆ ప్రాజెక్టునైనా పరుగులు పెట్టించి త్వరగా పాఠశాలను ప్రారంభించాలని కోరారు. ఎన్నికల ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో ఒక్క పెన్షన్ మినహా ఏ పథకాన్ని ప్రారంభిచకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పెన్షను కు నెలకు రూ. 1,250 కోట్లు చొప్పున ఆర్నెళ్లకు రూ. 15 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం ఆ రూ. 15వేల కోట్లను విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజల వద్దే దండుకుంటోందని ఎండగట్టారు. ఇప్పటికైనా కూటమి నాయకులు రాజకీయాలను పక్కనపెట్టి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మనూజరెడ్డి, మాజీ ఎపి ఎండిసి చైర్‌పర్సన్ షమీమ్ అస్లామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, సిటిఎం సర్పంచ్ ఆనంద పార్థసారథి, వైసిపి నాయకులు బాబ్ జాన్, వెలుగు చంద్ర లియాఖత్ ఆలీ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే సిఎం చంద్రబాబు ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పని చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మాజీ సిఎం జగన్ చేసిన పాపాలు రాష్ట్ర ప్రజలకు శాపాలుగా మారాయని ఆరోపించారు. ఆదివారం తన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం చేసిన అడ్డగోలు ఒప్పందాలతోనే ప్రస్తుత రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడుతోందని అన్నారు. ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, ట్రూఅఫ్ ఛార్జీలతో ప్రజల నడ్డి విరిచిన ఘనత వైసిపిదేనని అన్నారు. ఆ పార్టీ నాయకుల దాడులు, దౌర్జన్యాలు ఇప్పటికీ ఆగడం లేదన్నారు. ఇది వైసిపి ప్రభుత్వం కాదని, కూటమి ప్రభుత్వమని తప్పు చేస్తే ఎవరిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం వైసిపి నీచ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. దాడిలో గాయపడిన ఎంపిడిఒను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరామర్శించడం మంచి సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాల అమలుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో మదనపల్లి నియోజకవర్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టామని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రణాళిక బద్ధంగా ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. ఇందుకు నాయకులు, కార్యకర్తల సహకారం మరువలేనిదన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు బుద్ధి తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్.జె.వెంకటేష్, నాగూర్‌వలి, షంషీర్, ఎస్.ఎ.మస్తాన్, బెల్లరెడ్డి ప్రసాద్, జెసిబి మధు, పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల కోసం కృషి

డిఐఒ ఎం.కృష్ణయ్య





ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందరికీ అందుబాటులో ఉండి ఇంటర్మీడియట్ రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నామని జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాధికారి ఎం. కృష్ణయ్య పేర్కొన్నారు. రాబోయే ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి తీసుకుంటున్నా చర్యలు, ప్రణాళికలు, విద్యార్థులు ఎలా చదవాలో, పరీక్ష ఎలా రాయాలో వివరాలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బోధన వంటి అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో జూనియర్ కళాశాలల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 153 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ 25, ఎపిఆర్‌జెసి 2, హెచ్ ఎస్ ప్లస్ 8, మోడల్ స్కూల్ 17, కెజిబివి 22, ఒకేషనల్ 10, సోషల్ వెల్ఫేర్ 10, ఎంజె ఆర్‌ఎపి 1, ప్రయివేట్ 57, ఎయిడెడ్ 1, జూనియర్ కళాశాలలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?

జిల్లా వ్యాప్తంగా 29,962 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉన్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 15,231 మంది విద్యార్థులు ఉన్నారు. 72 67 మంది బాలురు, 7964మంది బాలికలు ఉన్నారు. జనరల్ లో మొత్తం 14,025 మంది విద్యార్థులు ఉండగా 6,797 మంది బాలురు, 7,228 మంది బాలికలు ఉన్నారు. ఒకేషనల్ కోర్సులలో మొత్తం 1,206 మంది ఉండగా ఇందులో 4,70 బాలురు,736 మంది బాలికలు ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 14,731 మంది విద్యార్థులు ఉండగా 7,010 మంది విద్యార్థులు బాలురు 7,721 మంది బాలికలు ఉన్నారు. జనరల్ లో మొత్తం 13,524 విద్యార్థులు ఉన్నారు.6,505 మంది బాలురు, 7019 మంది బాలికలు ఉన్నారు. ఒకేషనల్ కోర్సులో మొత్తం 1,207 మంది విద్యార్థులు ఉండగా 505 బాలురు 702 మంది బాలికలు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేశారా?

పాఠ్య పుస్తకాలు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి జూన్ నెలలో వచ్చాయి. అక్కడనుండి ప్రతి జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలను జిల్లా వ్యాప్తంగా 100 శాతం పంపిణీ చేశారు.

ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం సాధించడానికి అదనపు తరగతులను నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేక శిక్షణ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యాలా చూడడం, ఎవరైనా తరగతులకు సరిగా హాజరు కాకపోతే వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలకు హాజరయ్యాలా చూడడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉంది. గేస్ట్ ఫ్యాకల్టీని తీసుకొని వారి ద్వారా తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాం.

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమి ఇవ్వాలనుకుంటున్నారు?

విద్యార్థులు క్రమం తప్పకుండా రోజూ కళాశాలకు హాజరు కావాలి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఏ రోజుకు ఆరోజు నేర్చుకోవాలి. రాత్రి వేళలో తొందరగా పడుకొని ఉదయం తొందరగా లేచి ఉదయం వ్యాయామం చేయాలి. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలి. మంచి వారితో స్నేహం చేయాలి. కళాశాలలో తరగతి గదిలో ఏమైనా స్టడీ పైన అనుమానం ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి. కళాశాలకు హాజరు కానప్పుడు పక్కన స్నేహితులను అడిగి ఆరోజు పాఠ్యాంశాలు చెప్పారో తెలుసుకోవాలి. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలి.

బల్క్ టెండర్ రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుల్లంపేట



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వెరైటీస్ ఖనిజం లభిస్తుందని, ఈ ఖనిజాన్ని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 ఏళ్ల నుండి బెరైటీస్ ఖనిజాన్ని వెలికి తీసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపి ఎండిసి యాజమాన్యం లోపాయికారి ఒప్పందంతో బెరైటీ సి, డి గ్రేడ్‌గా విభజించి ధర తగ్గించి వేస్తున్న 60 లక్షల మెట్రిక్ టన్నుల బల్క్ టెండరును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి ఎండిసి సంస్థలో అవినీతి పరాకాష్టకు చేరిందని సంస్థకు సుమారు రూ. 500 కోట్ల నష్టం వాటిల్లిందని యాజమాన్యం, చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరుచుకోవాలని పేర్కొన్నారు. బెరైటీస్ వల్ల ఎపిఎండిసి సంస్థకు వేలకోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, ఈ మధ్యకాలంలో అధికారులు తీసుకుంటున్న లోపాయికారి ఒప్పందాల వల్ల ఖనిజాభివృద్ధి సంస్థకు వందల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో యాజమాన్యం మంగంపేటలో ఉన్న సి, డి గ్రేడ్‌కు 60 లక్షల మెట్రిక్ టన్నులకు టెండర్స్ పిలిచారన్నారు. అందులోనే అసలైన అవినీతి వెలుగు చూసిందని, సి, డి ఖనిజం ప్రస్తుతం ఒక టన్నుకు రూ. 1680 రేటు ఉంటే యాజమాన్యం బయ్యర్లతో లోపాయికారి ఒప్పందం చేసుకొని టెండర్‌లలో ఒక టన్ను రేటు రూ.1188 తగ్గించడం వెనుక భారీగా అవినీతి రాజ్యమేలిందని అందరికీ అర్థమవుతుందని తెలియజేశారు. దీని వల్ల సంస్థకు ప్రస్తుత రేటు ప్రకారం సుమారు రూ. 500 కోట్లు రూపాయల నష్టం వాటిల్లుతుందని, ఈ అవినీతి సొమ్ము ఎవరి కాజేస్తున్నాయో అర్థం కావడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని టెండర్‌ను రద్దుచేసి అవినీతి అధికారులపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశ:లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయటం అభినందనీయమని, రక్తదానం ప్రాణదానంతో సమానమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. జనసేన పార్టీ అధ్వర్యంలో ఆదివారం జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు రోజుల క్రితం రక్తం అవసరమై రక్తదానం కేంద్రానికి విచ్చేసిన జనసేన నాయకుడు రామాంజులు రక్తనిల్వలు తక్కువగా వున్నట్లు తెలుసుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు చాలమంది రక్తంలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటి వారి కోసం యువత, విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాంధీ, జనసేన కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.


ఎంపిడిఒ జవహర్‌బాబును పరామర్శిస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి

ఎంపిడిఒను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామాపురం

విధి నిర్వహణలో ఉన్న గాలివీడు ఎంపిడిఒపై దాడి చేసిన వైసిపి నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి అన్నారు. వైసిపి నేత దాడిలో గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న ఎంపిడిఒ జవహర్ బాబును ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైసిపి నాయకులు గత ఐదు సంవత్సరాలుగా ప్రజలపై మరియు ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం వారికి అలవాటుగా మారిందని. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అలాంటి దాడులకు వారు ఇప్పటికైనా పూర్తిగా స్వస్తి పలకాలన్నారు ప్రజల సంక్షేమం ప్రజల సుఖ సంతోషాలు కోరే ఈ ప్రభుత్వంలో ఎవరిపైన దాడులు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోకుండా ప్రభుత్వ అధికా రులపై దాడి చేయడం క్షమించారని నేరమని అన్నారు. గతంలో ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం వల్ల అధికారు, ప్రజలు వైసిపికి మంచి గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు, కార్య కర్తలు, తన పార్టీకి జరిగిన ఘోర పరాజయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులపై దాడులను పూర్తిగా మానుకోవాలన్నారు ఆయన వెంట రామాపురం టిడిపి నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ సాగు

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండల పరిధిలోని పలు గ్రామాలలో వేరుశనగ సాగును రైతులు విస్తారంగా చేపట్టారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా పెన్నానది పరివాహక గ్రామాలు తిప్పి రెడ్డిపల్లి, అనం తపురం, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరుతోపాటు పలు గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేపట్టారు. సాధారణంగా సెప్టెంబర్ నెలలో వేరుశనగ సాగు చేపడతారు. ఈ ఏడాది అక్టోబర్ చివరి వరకు సాగు చేపట్టారు. ఈ ఏడాది మైలవరం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేయడంతో పంటకు సాగునీటి కొరత లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగలో కలుపులు తీత చేస్తు న్నారు. సత్తువలు వేస్తున్నారు. రబీ సీజన్‌లో వేరు శనగతో పాటు రైతులు అధికంగా మినుము, మొక్కజొన్న పంటలను కూడా సాగు చేపట్టారు. వెం గన్నగారి పల్లి, చియ్యపాడు పరిధిలో శనగ పంట రైతులు సాగు చేపట్టారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లలకు చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమని 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి అన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన పాఠశాలల అండర్-15 విద్యార్థులకు స్థానిక శివశంకర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రొద్దుటూరు చెస్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం చెస్ పోటీలు నిర్వ హించారు. ముఖ్యఅతిధిగా కౌన్సిలర్ శివజ్యోతి మాట్లాడుతూ ప్రస్తుత సమా జంలో సెలవు దినాల్లో పిల్లలు అధికంగా సెల్‌ఫోన్‌లకు అంకితమవు తున్నారని, ఇది ఒక వ్యసనంగా మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పిల్లలకు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర వుతున్నాయన్నారు. చెస్ క్రీడాకారులను పిల్లలు ఆదర్శంగా తీసుకొని మేధో సంపత్తిని పెంపొందించుకోవాలన్నారు. యుక్తవయసు పిల్లలంతా ఏదోక క్రీడలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ప్రధాన ఉపా ధ్యాయులు ఇమామ్‌హుశేన్, టిఎస్టీయుసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్, ప్రొద్దుటూరు చెస్ క్లబ్ నిర్వాహకులు రెడ్డి పవన్, ఆర్బిటర్ ముజమీల్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు విజయవంతం

ప్రొద్దుటూరు : బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక టివిఆర్ పాఠశాల సమీపంలో ఆదివారం నిర్వహించిన క్రాస్ కంట్రీ పోటీలు విజయవంతమయ్యాయి. జిల్లాస్థాయి బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంశాపత్రాలు అందించారు. వీరు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా తెలిపారు. జనవరి 5న ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరుగబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ (దూరపు పరుగుపందెం) వైఎస్సార్ కడప జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. వ్యాయామ సంచాలకులు పి.వెంకటసుబ్బయ్య, లక్ష్మి, చరణ్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు, సంజీవ్, దిలీప్, ఖాదర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు రబ్బాని ఈ క్రీడల నిర్వహణలో సహకరించారని వారికి అహ్మర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు.

రచనా వైవిధ్యాన్ని ప్రదర్శించిన డాక్టర్ మౌని

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రాచీన, ఆధునిక కవితా ప్రక్రియల్లో విభిన్న భాషల్లో పలు రచనలు చేసి వైవిధ్యాన్ని ప్రదర్శించిన కవి, రచయిత డాక్టర్ మౌని అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన కేంద్రం సహాయాంధ్ర పరిశోధకులు డాక్టర్ తొండాటి రాజశేఖర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 139వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి అధ్యక్షత వహించగా, 'డాక్టర్ మౌని జీవితం - సాహిత్యం' అనే అంశంపై డాక్టర్ తొండాటి రాజశేఖర్ ప్రసంగించారు. సభాధ్యక్షులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ లబ్ధప్రతిష్ఠులైన రచయితలనే కాక మరుగునపడిన రచయితలను కూడా పరిచయం చేయడం నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. 32 రచనలు చేసి తిరుపతి ప్రాంతానికే పరిమితమైన డాక్టర్ మౌనిని నేడు సాహితీ సమాజానికి పరిచయం చేయడం ముదావహమన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ తొండాటి రాజశేఖర్‌ను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలసి సత్కరించారు. కార్యక్రమంలో పుత్తా పుల్లారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, మునికుమార్, మధుబాబు, రమణమూర్తి, కె.వి.రమణారెడ్డి, శ్యామసుందర్ రెడ్డి, రాజారెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, కరీముల్లా, బాల యల్లారెడ్డి, ఆదిమూలం గోపాలకృష్ణయ్య, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల భవనాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -బ్రహ్మంగారిమఠం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో భాగంగా ఆగిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహూల్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు పూర్తికాకుండా మధ్యలో ఆగిపోయాయని తెలిపారు. భవనాల నిర్మాణం సందర్భంగా అక్కడ ఉన్న ఇటుకలు, దిమ్మెలు, ఇసుక కడ్డీలు వంటివి విద్యార్థులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ప్రమాదాలు కూడా జరిగి అవకాశం ఉందన్నారు. బ్రహ్మంగారిమఠంలోని బాలికల హైస్కూల్, సోమిరెడ్డిపల్లి, పాపిరెడ్డిల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాహూల్ హెచ్చరించారు.

అధ్వానంగా తారు రోడ్డు..ప్రయాణం నరకం

ప్రజాశకి-కలకడ


మరమ్మతులకు నోచని తారు రోడ్డు

మండల కేంద్రం కలకడలోని స్థానిక సినిమా హాలుకు ఎదురుగా ఉన్న తారు రోడ్డు గుంతల మయంగా మారి అధ్వానంగా తయారైంది. ఈరోడ్డుపై వెళ్లాలంటే నరక ప్రాయంగా మారిందని ప్రమాదాల పడతామోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు నుంచే దేవళంపేట, అగ్రహారం, దళితవాడ, గొల్లపల్లి, ఎల్లగుడిబండ, కోన వరకు తారు రోడ్డును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారికిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు రోడ్డును శాశ్వతంగా మరమ్మతులు చేయకపోవంతో రోడ్డుపై తారు తేలి రాళ్లు బయట పడ్డాయని అన్నారు. గుంతలను తారుతో పూడ్చడం తిరిగి వర్షం వచ్చినప్పుడు గుంతలు ఏర్పడడం పరిపాటిగా మారిందని చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు పలువురు ఆ రోడ్డులో వెళ్లాలంటే ప్రయోగాలు చేయక తప్పడం లేదని, అదమరిస్తే అంతే సంగతులని అంటున్నారు. ప్రస్తుతం భాస్కర్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ రెండు లక్షల 80 వేల రూపా యల తో తిరిగి గుంతలను పూడ్చివేసి తారు రోడ్డుకు బట్టక వేసినట్లు మాసికలు వేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెళ్ళువెత్తు తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్ అండ్‌బి అధికారులు స్పందించి కలకడ నుంచి దేవలంపేట, అగ్రహారం, ఎల్లంగుడిబండ, కోన వరకు ఉన్న తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎంపిజె రాయలసీమ ఇన్‌ఛార్జిగా అయూబ్ ఖాన్



అయూబ్ ఖాన్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎంపిజె రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రధాన కార్యదర్శి సలీం రాయలసీమ ఇన్‌ఛార్జిగా ఎండి అయూబ్ ఖాన్‌ని నియమించారు. ఆ మేరకు ఆయన ఆయూబ్‌ఖాన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం స్థానిక జిన్నా రోడ్డులోని ఎంపిజె కార్యక్రమంలో సభ్యత్వ నమోదు, శిక్షణ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుప్రీం కౌన్సిల్ మెంబర్ హుస్సేన్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం హాజరయ్యారు. ఈసందర్భంగా సలీం మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో శాంతి, న్యాయస్థాపన కోసం ఎంపిజెలో చేరండని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి మాట్లాడుతూ ప్రజలకు వైద్య, విద్య, ఆహారం సమానంగా లభించినప్పుడే రాష్ట్రంలో సుఖ సంతోషాలు ఉంటాయన్నారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర బాధ్యులు తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ.. ఈ పదవికి సరైన న్యాయం చేకూరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు రవి, ముక్తయార్, సయ్యద్, ఇర్ఫాన్ సత్తార్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోకండి :ఎస్‌పి


ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఏ ప్రభుత్వ రిక్రూ ట్మెంట్లు అయినా పారదర్శకంగా నిర్వహిస్తారని గుర్తించాలని, పోలీసు ఉద్యోగాల నియామకాల్లో దళారులను నమ్మి మోస పోవద్దని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోసగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. మోసగాళ్లు, దళారుల పట్ల అప్రమత్తంగా ఉంటూ మోసాల బారిన పడవద్దని కానిస్టేబుల్ అభ్యర్థులకు తెలిపారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దళారులు, మోసగాళ్లు ఎవరినైనా సంప్రదిస్తే డయల్ - 100 కు గానీ,112, లేదా సమీపంలోని పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పోలీసు యంత్రాంగం చేసినట్లు పేర్కొన్నారు. దేహ దారుఢ్య పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు, పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వమని చెబితే స్థానిక పోలీసులకి తెలియ జేయస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


దేహదారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎఎస్‌పి ప్రకాష్‌బాబు

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల రిహార్సల్ పరిశీలించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగర శివార్లలోని డిటిసి మైదానంలో సోమవారం నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రారంభమయ్యే పిఎంటి (ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్), పిఇటి(ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్) పరీక్షల నేపథ్యంలో విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది, కొంతమంది యువకులతో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)కె.ప్రకాష్‌బాబు ఆదివారం ట్రయల్‌రన్ (రిహార్సల్) నిర్వహించారు. డిటిసి మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి జనవరి 8 వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆర్.ఎఫ్.ఐ.డి సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఎ.ఆర్) బి.రమణయ్య, జిల్లాలోని డి.ఎస్.పిలు, సిఐలు, ఎస్సైలు, పోలీసులు, డిపిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'రూట' రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఆధ్వర్యంలో 'రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్' ఏర్పాటు చేశారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ రూట ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం ను అంగనవాడిల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు స్థాపనకు, పటిష్టపరిచేందుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గం చీఫ్ పాటర్న్ సయ్యద్ హిదాయతుల్లా (రూట వ్యవస్థాపక అధ్యక్షులు) గౌరవ అధ్యక్షులు హఫీజ్ షేక్ అహ్మద్ (ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, విజయవాడ) అధ్యక్షులు డాక్టర్ సయ్యిద్ వసివుల్లా బఖ్తియారి (ఉర్దూ విభాగాధిపతి, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప) ప్రధాన కార్యదర్శి ఎం.అబ్దుర్ రషీద్ (జూనియర్ లెక్చరర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కదిరి) మహిళా కార్యదర్శి డాక్టర్ షాజియా బేగం (డిగ్రీ

అడవులు అంతరిస్తే ముప్పే

ప్రజాశక్తి - వేంపల్లె : అడవులు క్రమంగా అంతరించి పోతున్నాయని, దీని పర్యవసానంగా ప్రపంచానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం మండ లంలోని ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో అంత ర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యం ప్రాముఖ్యత, వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగా హన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడుతాయన్నారు. అభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేయడం వల్ల అడవులు క్రమేణా అంతరించి పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు సహజ వనరులను అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు. సదస్సులో ఎఒ రవికుమార్, అనిల్‌కుమార్ రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ చేయడం కొద్దిమందికే సాధ్యం

జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్ : సేవ చేయాలనే ఆకాంక్ష చాలా మందిలో ఉన్నా వారిలో కొంత మందికే సాధ్యపడుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, ప్రముఖ విద్యావేత్త, హిందూపురం మాజీ పార్లమెంటరీ ఇంచార్జి లయన్ పి.ఖాసీం ఖాన్, ఆడిటర్స్ రాష్ట్ర సలహాదారుడు షరీఫ్ ఖాన్ పేర్కొన్నారు. నగరంలోని కోపరేటివ్ కాలనీలో ఉన్న కె కె ఆడిట్ కార్యాలయంలో ఆదివారం సేవ్ గర్ల్ చైల్డ్ అనే నినాదంతో రూపొందించిన జన వికాస సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పేద ప్రజలను ఆదుకోవడానికి 12 సంవత్సరాల నుంచి ఎన్నో సేవలు నిర్వహిస్తున్న తాహిర్‌ను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నగర ఉపాధ్యక్షుడు పి.మన్సూర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు పి.అఫ్జల్ అలీ ఖాన్, ఐయుఎంఎల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్. అలీ షేర్, సంస్థ ప్రతినిధులు నూనె నగేష్, డాక్టర్ శ్రీనివాసులు, సి.ఎస్.నాసర్ అలీ, అబ్దుల్ వాజీద్, మస్తాన్ వల్లి, వల్లెపు శివ, డాక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.

కెసి కాలువలో ఆగిన నీటి సరఫరా

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువ ఆయకట్టు పరిధిలో వరి నూర్పిడి పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా కాలువకు నీటిని నిలుపుదల చేశామని ఎఇ గురుమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మండల పరిధిలో ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నీటితో రైతులకు అవసరం లేదు. అంతేకాకుండా గత నెల రోజులుగా తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో ఆరుతడి పంటలకు కూడా తాత్కాలికంగా నీటి అవసరం ఏమాత్రం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కాలువలో నీరు వృథాగా పోతుందన్న కారణంతో రైతల అభిప్రాయం మేరకు నీటిని నిలుపుదల చేశామన్నారు. వరి పంట నూర్పిడి పనులు పూర్తయిన తర్వాత మళ్లీ నీటిని విడుదల చేస్తామని ఎఇ తెలిపారు.

సంక్రాంతికైనా పాత బకాయిలు చెల్లించండి :ఎస్‌టియు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడి 6 నెలలైనా ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కారానికి ఆలస్యం చేస్తున్నదని, సంక్రాంతి పండుగకైనా పాత బకాయిలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రో పాధ్యాయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు ఇలియాస్‌బాషా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌టియు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఎల్స్, ఎపిజిఎల్ఐ, ఫైనల్ పేమెంట్స్ పీఎఫ్ ఫైనల్ పేమెంట్స్ పిఎఫ్ లోన్లు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటి చెల్లింపుల కోసం ఉపాధ్యాయలోకం ఎదురుచూస్తున్నదని తెలిపారు. సంక్రాంతి పండక్కైనా చెల్లింపులు చేయాలని కోరారు. రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు సురేష్ బాబు మాట్లాడుతూ చాలా పాఠశాలలో ఉపాధ్యాయ ప్రమోషన్లు చేపట్టి వాటిని భర్తి చేయాలని కోరారు. త్వరితగతిన జేఎల్ ప్రమోషన్లు కూడా చేపట్టాలని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం బాలగంగి రెడ్డి మాట్లాడుతూ నాన్ టీచింగ్ వారి పట్ల ఉన్న మక్కువ ఉపాధ్యాయుల పట్ల లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జేఎల్ ప్రమోషన్లు 40 శాతం వెంటనే ఉపాధ్యాయులకు చేపట్టాలని కోరారు. 12వ పిఆర్సి ఆలస్యం అవుతున్న కారణంగా 30శాతం ఫిట్మెంట్ వెంటనే ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో ఎస్టియు నాయకులు గాలి సుబ్బారాయుడు, ప్రతాప్ రెడ్డి, నందగోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిఆర్‌సి కుమారుడి మృతికి మంత్రి ఫరూక్ నివాళి

ప్రజాశక్తి-కడప అర్బన్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు విష్ణు స్వరూప్ గుండె పోటుతో శనివారం మృతి చెందిన విషయం విధితమే. ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం కడప కో-ఆపరేటివ్ కాలనీలోని రామచంద్రయ్య స్వగృహంలో ఉంచారు. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ కడపకు చేరుకుని విష్ణు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుమారుడిని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న రామచంద్రయ్యను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బరాయుడు, తిరుపతి జిల్లా జనసేన అధ్యక్షుడు హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ చంగల్ రాయుడు, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, బాలసుబ్రమణ్యం, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, కుప్పాల వెంకటసుబ్బయ్య, టీవీఎస్ మూర్తి పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. అనంతరం చలమారెడ్డిపల్లి, బండి కనుమ వద్ద ఎమ్మెల్సీ మామిడి వనంలో విష్ణు స్వరూప్ పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.లెక్చరర్, ఎస్కెఆర్ అండ్ ఎస్కెఆర్ మహిళ డిగ్రీ కళాశాల,కడప) సలహాదారులు డాక్టర్ ముహమ్మద్ నిసార్ అహ్మద్, (ప్రొఫెసర్, ఉర్దూ విభాగం, ఎస్ వి యూనివర్సిటీ, తిరుపతి) డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుస్సేన్ (సీనియర్ లెక్చరర్, డైట్, కర్నూలు) రాష్ట్ర సమన్వయకర్త షేక్.ముహమ్మద్ అయ్యూబ్, (కడప)లను ఎన్నుకున్నారు.


రామచంద్రయ్యను ఓదారుస్తున్న మంత్రి ఫరూక్


రోడ్డుపై అలుముకున్న పొగమంచు

పొగమంచుతో వాహనదారులకు అవస్థలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో చలి తీవ్రత విపరీతంగా పెరగడంతో దట్టంగా మంచు దుప్పటి కప్పేసింది. మండలంలోని అన్ని ప్రాంతాలలో ఉదయం నుంచి సుమారు తొమ్మిది గంటల వరకు పొగ మంచు దట్టంగా అలుము కోవడంతో దారి కనిపించడం లేదని వాహనదారులు, బాటసారులు పేర్కొంటున్నారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో వాహనదారులు వాహ నాలకు లైట్లను ఏర్పాటు చేసుకుని సుమారు ఎనిమిది గంటల వరకు ప్రయా ణాలు సాగిస్తున్నారు. పొగమంచు ప్రయాణించే వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

విభిన్న ప్రతిభావంతులకు సోమవారం రైల్వే కోడూరు హెచ్ ఎంఎం హైస్కూల్‌లో విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సమైక్య సంఘం మండల అధ్యక్షుడు సుబ్బ నరసారెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ నెలలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల సహాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో సహాయ పరికరాలు అందిస్తారని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సహాయక పరికరాలు పొందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఉదయం 8 గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

మామూళ్ల మత్తులో తనిఖీ సిబ్బంది

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని కాండ్లమడుగు క్రాస్ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ తనిఖీ కేంద్రం సిబ్బంది మామూళ్ల దందా మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగుతోంది. వాహనాలలో ఏమి తరలిస్తున్నారో తనిఖీలు చేయకుండా జేబులు నింపుకునే పనిలో సిబ్బంది ఉండడం శోచనీయం. మీరు ఏమైనా తీసుకెళ్లండి, మా జేబులు మాత్రం నింపండి అంటూ అక్రమార్కులకు తనిఖీ కేంద్రం సిబ్బంది వత్తాసు పలుకుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి,మత్తు పదార్థాలు, ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారా విపరీతంగా రవాణా,వాడకం జరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో తనఖీ కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు పేర్కొంటు న్నారు. మరీ ముఖ్యంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్శిలీహిల్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చిపోతూ ఉంటారు. తనఖీ కేంద్రం సిబ్బంది ఇప్పటికైనా మామూళ్ల మత్తు వదిలి గట్టి నిఘా పెట్టాలని ప్రజల విజ్ఞప్తి చేస్తున్నారు.


లారీ డ్రైవర్ నుంచి డబ్బులు తీసుకుంటున్న తనిఖీ సిబ్బంది

క్రైం కార్నర్

వ్యక్తిపై కొడవలితో దాడి

-మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు

-ఘర్షణకు దారితీసిన తాగునీటి కుళాయి వద్ద ఇద్దరు మహిళల గొడవ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తాగునీటి కుళాయి వద్ద ఇద్దరి మహిళల మధ్య జరిగిన ఘర్షణ ఒక వ్యక్తిపై కొడవలితో దాడి చేసే వరకు చేరింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గంగిరెడ్డి పల్లెలో హసీనా, కవిత అనే ఇద్దరి మహిళల మధ్య తాగునీటి కుళాయి వద్ద దుస్తులు ఉతికే విషయమై శనివారం ఘర్షణ జరిగింది. హసీనా కవితను దుర్భాషలాడిందని అన్నారు. ఇది విన్న కవిత మామ ఎం.గంగిరెడ్డి వచ్చి వాదించారు. కోపం పెంచుకున్న హసీనా శనివారం రాత్రి సత్య సాయిజిల్లా నల్ల చెరువులోని సోదరులతో ఫోన్ ద్వారా జరిగిన ఘర్షణను వివరించింది. హసీనా సోదరుడు మౌలా ఆదివారం ఉదయం కుటుంబీకులతో కలసి గంగిరెడ్డి పల్లెకు వచ్చాడు. వాహనం నుంచి దిగి ఏకంగా గంగిరెడ్డి, ఇంట్లోకి చొరబడి గంగిరెడ్డి, కోడలు కవితలపై దాడి చేశాడని చెప్పారు. ఆవేశంలో కొడవలితో గంగిరెడ్డి మోకాలు పై నరికాడని తెలిపారు. తీవ్రగాయమై రక్తస్రావం జరిగి గంగిరెడ్డి స్పృహ తప్పి పడిపోయాడని, కేకలు విన్న స్థానికులు వచ్చేలోపు మౌలా కుటుంబ సభ్యులు వాహనంలో వెళ్లిపోయారని చెప్పారు. వాహనం అందుబాటుకు రాకపోవడంతో మొలకలచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. అప్రమత్తమైన పోలీసులు నిందితుల వాహనాన్ని అడ్డగించి అందులోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. స్థానికులు గంగిరెడ్డి ని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ అమర సింహరాజు వైద్య చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం అదే 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎలిపారు. హెడ్ కానిస్టేబుల్ శేఖర్ సిబ్బందితో ఆస్పత్రికి చేరుకొని బాధితులను విచారించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

గానుగ మిషన్‌లో పడి బాలుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట


ప్రమాదంలో గాయపడిన బాలుడు

ప్రమాదవశాత్తు గానుగ మిషనులో పడి బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోటలో ఆదివారం జరిగింది. పట్టణంలోని సంత బజారుకు చెందిన ఆయాన్ ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు గానుక మిషనులో పడిపోయాడు. బాలుడి కుడి చేయి పూర్తిగా తెగిపోయింది. బాలుడి కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యుల సూచనల మేరకు 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ముందుగా 108 ఇఎంటి ఉమశ్రీ, పైలట్ రాజులు ప్రథమ చికిత్స అందించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లి డిఎస్‌పి కొండయ్యానాయుడు, పిటిఎం ఎస్ఐ రవి కుమార్, వారి సిబ్బంది సహాయంతో పోక్సో కేసులో నిందితుడైన పిటిఎం మండలం, కందుకూరు చెందిన జి.శ్రీనివాసులు కుమారుడు జి.నరసింహులు(21)ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఆదివారం స్థానిక మొరసుపల్లి క్రాస్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకొని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం జెఎఫ్‌ఎంసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.